క్లుప్తంగా

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని టవర్‌క్లాక్ 22వ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వార్డు ఇంచార్జ్‌లు దాదాపీర్, ఓంప్రకాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పింఛన్‌దారులు పింఛన్ సొమ్ము కోసం పడిగాపులు కాసేవారని, ఈ ప్రభుత్వంలో ఉదయం 6 గంటలకే వలంటీర్లు లబ్ధిదారులు ఇంటి తలుపులు తట్టి పింఛన్ అందజేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు వారి ఇంటి వద్దే అందజేస్తున్నరని తెలిపారు. అనంతరం వలంటీర్లకు దుశ్శాలువాలు, పూలమాలలతోను సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగానికి జగనన్న పెద్దపీట



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ధర్మవరం: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేశారని, ఇందుకు విద్యార్థుల చదువుల కోసం రూ.73వేల కోట్లు ఖర్చుపెట్టడమే నిదర్శమని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి వేముల అమర్‌నాథ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు ఈడిగ వినయ్‌తేజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్న విద్యాదీవెన నిధులను విడుదల చేయడాన్ని హర్షిస్తూ శనివారం పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పీఆర్‌టీ సర్కిల్ వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవడం అంటే ఖర్చుతో కూడుకున్నదన్నారు. ఇలాంటి తరుణంలో జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో జగనన్న పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారన్నారు. నాడు నేడు ద్వారా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాపాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు.


'పీఎం సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ గంగాధర్

ధర్మవరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఈఈ గంగాధర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ పథకం ద్వారా 0–నుంచి 150 యూనిట్లు వాడే విద్యుత్ గృహ వినియోగదారులకు 1కిలో వాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తారని, ఇందుకు రూ.30 వేల నుంచి రూ.60 వేలు సబ్సిడీ, 150 నుంచి 300 యూనిట్లు వాడే వారికి 2 లేదా 3 కిలో వాట్‌ల ప్లాంట్‌పైన రూ.60 వేల నుంచి రూ.78వేల వరకు సబ్సిడీ, 300 యూనిట్లకు పైగా వాడే వినియోగదారులకు 3 కిలోవాట్‌ల ప్లాంట్‌కు గానూ రూ.78 వేల దాకా సబ్సిడీ ఇస్తారన్నారు. డబ్ల్యూడబ్ల్యూపీఎం సూర్యఘర్‌జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యుత్‌శాఖ డీఈ లక్ష్మినర్సింహారెడ్డి, ఏఈలు నాగభూషణ, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలియో మహమ్మారిని తరిమేద్దాం



ధర్మవరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాలోమాన్

సాక్షి బృందం: పోలియో మహమ్మారిని తరిమేద్దామని అధికారులు పేర్కొన్నారు. శనివారం పల్స్ పోలియో విజయవంతం చేయాలని కోరుతూ ధర్మవరం, తాడిమర్రి, బత్తలపల్లి, బుక్కపట్నం, నల్లమాడ, ఓడీచెరువు, ఎన్‌పీకుంట, తలుపుల తదితర మండల కేంద్రాల్లో వైద్యాధికారులు సిబ్బంది, విద్యార్థులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. ఆదివారం పోలియో బూత్‌లలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వయస్సు లోపు ఉన్న పిల్లలందరికి పోలియో చుక్కలు వేస్తారని వైద్యాధికారులు తెలిపారు. అలాగే 4,5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు.

ఫ్యాక్షన్ కోటలో సంక్షేమ సౌరభం

ఒకప్పుడు కక్షలు, కార్పణ్యాలు, గొడవలకు నిలయమైన చెర్లోపల్లి.. నేడు స్నేహగీతం వినిపిస్తూ అభివృద్ధి దిశగా సాగుతోంది. మండల కేంద్రం పుట్టపర్తి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. పక్కనే బుక్కపట్నం రిజర్వ్ ఫారెస్ట్. గ్రామం అంతా వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. గతంలో సమస్యలను పట్టించుకున్న వారు లేరు. దీంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామ రూపు రేఖలు మారిపోయాయి.

- చెర్లోపల్లిలో విరబూసిన శాంతికుసుమం
- జగన్ పాలనలో అభివృద్ధి దిశగా పయనం
- పక్కా భవనాల్లోంచే ప్రభుత్వ సేవలు



ఇటీవల ప్రారంభించిన గ్రామ సచివాలయం



కృష్ణా జలాల కోసం గ్రామంలో సిద్ధమైన పైపులు

పుట్టపర్తి అర్బన్: చెర్లోపల్లి గ్రామంలో సంక్షేమ కాంతులు విరబూస్తున్నాయి. 757 కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామంలో మెజార్టీ కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందాయి. జగన్ సర్కారు ఈ ఐదేళ్లలో వివిధ పథకాల ద్వారా ప్రజల ఖాతాలకు జమ చేసింది రూ.15.23 కోట్లు. దీంతో పాటు విద్యాకానుక, 82 మందికి ఇంటి స్థలాలు– పక్కాగృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత, కంటి వెలుగు, గోరుముద్ద, ఇంటింటికీ రేషన్ తదితర కార్యక్రమాలకు రూ.6.87 కోట్ల వ్యయం చేసింది. ఇక రూ.45 లక్షలతో సచివాలయం భవనం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.5 లక్షలతో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.6లక్షలతో పీర్లచావిడి, రూ.3 లక్షలతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ఏర్పాటు చేశారు. సచివాలయ పరిధిలోని చెర్లోపల్లి, కంబాలపర్తి గ్రామాల్లో రూ.60 లక్షలు వెచ్చించి సిమెంటు రోడ్లు వేశారు. అంతేకాదు 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిధుల ద్వారా రూ.2.5 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మించారు.

బడిలో మెరుగైన సౌకర్యాలు

చెర్లోపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు మంచి పేరుంది. చెన్నకృష్ణారెడ్డి అనే ప్రధానోపాధ్యాయుడు విదేశీయుల సహకారంతో 15 కంప్యూటర్‌లు ఏర్పాటు చేసి ఇక్కడి విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తెచ్చారు. అదేవిధంగా సత్యసాయి తాగునీటి పథకాన్నీ వారి సహకారంతోనే ప్రారంభించారు. ఈ అభివృద్ధిని కొనసాగిస్తూ పాఠశాలలో బల్లలు, ఫ్యాన్‌లు, మరుగుదొడ్లు, ఆటస్థలం సౌకర్యం కల్పించారు.

కృష్ణా జలాలతో సస్యశ్యామలమే!

పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులను నింపేందుకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఇటీవలే పైప్‌లైను పనులు ప్రారంభించారు. పని పూర్తయితే చెర్లోపల్లి చెరువులో కృష్ణా జలాలు అందుబాటులో ఉంటాయి. అప్పుడు గ్రామం సస్యశ్యామలమవుతుంది. రైతుల కల సాకారమవుతుంది.

ప్రభుత్వ సహకారం మరువలేం



ఎన్నడూ చూడని అభివృద్ధిని ఈ ఐదేళ్లలో చూశాం. పథకాలతో పాటు విద్య, వైద్యం, సర్టిఫికెట్లు, ఆధార్ కేంద్రం ఎరువులు, విత్తనాలు అన్నీ గడప వద్దకే వచ్చాయి. ప్రజలు సుఖంగా ఉన్నారు. గతంలో మాదిరిగా గొడవలు లేవు. అంతా అభివృద్ధి మంత్రంతో సద్దుమణిగిపోయాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– హనుమంతరెడ్డి, వైస్ ఎంపీపీ, చెర్లోపల్లి

పక్కా భవనాల్లో సేవలు



ఇటీవల సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభించారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, పీర్లచావిడి సైతం అందుబాటులోకి వచ్చాయి. పక్కా భవనాల నుంచే సేవలు మొదలయ్యాయి. సాగు నీటి పనులు పూర్తయితే ఇక గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– నాగరాజు, చెర్లోపల్లి

మంత్రి పర్యటన జయప్రదం చేద్దాం

తలుపుల: మండలంలో ఆదివారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఫయాజ్ అహ్మద్, ఎంపీపీ రఫినాయక్ కోరారు. మధ్యాహ్నం 1 గంటకు కుర్లి సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభిస్తారన్నారు తర్వాత స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించనున్న ఆసరా ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు.

ఎన్‌పీ కుంట: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం నిర్వహించే వైఎస్సార్ ఆసరా వారోత్సవాలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీ.ఎస్.మక్బూల్ అహ్మద్ హాజరవుతారని ఆ పార్టీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

నల్లచెరువు: మండలంలో ఆదివారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కదిరి సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, పార్లమెంట్ సమన్వయకర్త శ్రీమతి బోయ శాంతమ్మ పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ, సేవాదల్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ విభాగం సెక్రటరీ శ్రీధర్ రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించే వైఎస్సార్ ఆసరా ఉత్సవాలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కదిరి వైఎస్సార్‌సీపీ సమన్వకర్త మక్బూల్ అహ్మద్, హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ హాజరవుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం తెలిపారు. మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోరెడ్డిచంద్రశేఖరరెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఫయాజ్ అలీ,మాజీ జడ్పీటీసీ భాస్కరరెడ్డి, బీసీ కన్వీనర్ నరసింహగౌడ్, ఇక్బాల్ మాట్లాడుతూ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కనగానపల్లి మండలంలో టీడీపీకి షాక్



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన తూముచెర్ల సర్పంచ్ బంగి మల్లేసు

కనగానపల్లి: కనగానపల్లి మండలంలో టీడీపీకి ఎదురుదెబ్బ తగిలింది. దళిత సంఘాల ఉద్యమ నాయకుడు, తూముచెర్ల సర్పంచ్ బంగి మల్లేసు టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో శనివారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సమక్షంలో ఆయన వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంఆర్‌పీఎస్ వంటి దళిత సంఘాల్లో ఉద్యమ నాయకుడిగా పని చేసిన బంగి మల్లేసు గత రెండు పర్యాయాలు టీడీపీ తరపున తూముచెర్ల సర్పంచ్‌గా గెలుపొందారు. కానీ టీడీపీలో సరైన గుర్తింపు ఇవ్వకపోవడంతో పరిటాల కుటుంబానికి దూరంగా ఉంటున్నారు. ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు మల్లేసు తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి జగనన్న కృషి



విలేకరులతో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

కదిరి టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ తెలిపారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు ఇచ్చారన్నారు. గిరిజనులకు పెద్దపీట వేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గిరిజనుల కోసం ప్రత్యేక కమీషన్ ఏర్పాటు చేశారన్నారు. బంజారా సంఘం నాయకులు కృష్ణానాయక్, చలపతినాయక్, ఆనంద్‌నాయక్, మల్లికార్జునాయక్ పాల్గొన్నారు.

తనకల్లు: గిరిజన ప్రజల సంక్షేమానికి ప్రభుత్వ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ శనివారం తెలిపారు. పోమే నాయక్ తండాలో పర్యటించిన ఆయన ప్రజల సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ శోభ సువర్ణ, ఎంపీడీఓ నరసింహులు, సీఐ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ గోపాల్ నాయక్, రవీంద్ర నాయక్,క్రిష్టానాయక్ పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడండి



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి

ధర్మవరం అర్బన్: ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి అధికారులకు సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ సమావేశ భవనంలో శనివారం నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌లో అన్ని వసతులు ఉన్నాయా లేదా అని ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించుకోవాలన్నారు. ఓటర్లకు ఓట్లు వేసేందుకు అనుకూలంగా ఉండేలా చూడాలని తెలిపారు. ఎవరైనా తప్పిదాలు చేస్తే ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు చేపడుతుందని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ రామ్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, డీఏఓ రమేష్‌బాబు, నాలుగు మండలాల తహసీల్దార్లు, సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీసులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

ఎన్‌పీ కుంట: ఎన్.రెడ్డివారిపల్లి గ్రామానికి చెందిన ఎస్.రంజాన్‌వలి (38) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గం సమన్వయకర్త మక్బూల్‌అహ్మద్ తనయుడు అఖిల్ శనివారం ఆ పార్టీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి మృతుడి కుటుంబానికి రూ.20 వేలు అందించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. స్థానిక సింగిల్‌విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి రూ.10 వేలు అందజేశారు. మాజీ ఎంపీపీ జి.పుల్లారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, సీనియర్ నాయకులు షామీర్‌బాషా, మాజీ మండల కన్వీనర్ బాబాఫకృద్దీన్, గ్రామకన్వీనర్ అస్లాం, శ్రీరాములు, ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

తనకల్లు: బిక్లారివాండ్లపల్లికి చెందిన మొహిద్దీన్ సాబ్ (50) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ రూ. 10 వేలు ఆర్థికసాయం చేశారు. ఆ మొత్తాన్ని శనివారం నాయకులు షామీర్, మహబూబ్‌పీరా, లక్ష్మీరెడ్డి చేతుల మీదుగా మృతుని కుటుంబాన్ని ఆందజేయించారు.

4.5వ తేదీల్లో రైల్వే పాస్‌మేళా

కదిరి అర్బన్: స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఈ నెల 4,5వ తేదీల్లో దివ్యాంగులకు రైల్వే పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ సన్నీ వంశీ క్రిష్ణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగులకు రైల్వే రెన్యూవల్, కొత్త పాసులు మంజూరు చేస్తారని తెలిపారు. దివ్యాంగులు వారి సదరం సర్టిఫికెట్‌తో హాజరుకావాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీలో 60 కుటుంబాల చేరిక



పార్టీలో చేరినవారితో మక్బూల్ అహ్మద్ నాయకులు

కదిరి టౌన్: పట్టణంలోని 9వ వార్డులో ఏఐఎంఐఎం నియోజకవర్గ ఇన్చార్జ్ అక్బర్ ఖాన్ మద్దతుతో రియల్ ఎస్టేట్ వ్యాపారి తలుపుల షఫిక్, యువనేత తలుపుల షమాయిల్, కౌన్సిలర్ రేష్మనాసిర్ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 60 ముస్లీం కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్న మరోసారి ముఖ్యమంత్రిగా చేయడానికి కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్ఎండీ ఇస్మాయిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీషా సాధిక్, సాదత్ అలీఖాన్, పర్వీనా ఫయాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

నల్లచెరువు: పాలపాటదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కదిరి సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, వజ్ర భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కొండవీటి నాగభూషణ, లీగల్ సెల్ జోనల్ ఇంచార్జ్ లోకేశ్వర్‌రెడ్డి శనివారం స్వామి వారిని దర్శించుకొని పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి వారికి ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో వారు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ షమీవుల్లా, సేవాదల్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్‌రెడ్డి, జిల్లా రైతు విభాగం కార్యదర్శి వై శ్రీధర్‌రెడ్డి, బీసీ సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మిపతి యాదవ్, కల్లిపల్లి శ్రీనివాసులు, ఉత్తన్న, హైటెక్ రమణ నాయక్, రాంకిశోర్‌రెడ్డి డీజె ఈశ్వర్‌రెడ్డి, డీఎస్ పాల్గొన్నారు.

తనకల్లు: వైఎస్సార్ సీపీ శ్రేణులు కలసికట్టుగా పని చేయాలని వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ అన్నారు. బొంతలపల్లికి చెందిన నాయకులు, కార్యకర్తలు బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

నల్లచెరువు: వైఎస్సార్‌సీపీ కదిరి సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ జోగన్నపేట సర్పంచ్, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు దాసరి శ్రీనాథ్‌రెడ్డిని శనివారం గ్రామంలోని ఆయన నివాసంలో కలిశారు. పార్టీ లీగల్ సెల్ జోనల్ ఇంచార్జ్ లోకేశ్వర్‌రెడ్డి, నాయకులు బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, సర్పంచ్ విష్ణు వర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి పల్లె వ్యతిరేక వర్గీయుల డుమ్మా

పుట్టపర్తి టౌన్: టీడీపీ అధినేత చంద్రబాబు రా కదలిరా సభకు సంబంధించి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పల్లె రఘునాథరెడ్డి నిర్వహించిన సమావేశానికి ఆయన వ్యతిరేక వర్గీయులు డుమ్మా కొట్టారు. శనివారం పట్టణంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, పరిశీలకులు బుచ్చయ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి పల్లె వ్యతిరేక వర్గం నాయకులు ఎవరూ హాజరుకాలేదు. పల్లెకు తప్ప ఎవరికి టికెట్టు ఇచ్చినా గెలిపిస్తామని ఇప్పటికే అధిష్టానానికి తెలియజేశామని, ఇప్పుడు ఆయన చెబితే తాము సమావేశానికి వెళ్లాలా అని ప్రశ్నించినట్లు సమాచారం.

ఇంటర్ పరీక్షలకు 73 మంది హాజరు

అమడగూరు: శీతిరెడ్డిపల్లి సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హిందీ పరీక్షలు జరిగాయి. మొత్తం 78 మందికి 73 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ప్రభాకర్ పేర్కొన్నారు.

నల్లమాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ సెకండియర్ పరీక్షలు జరిగాయి. 120 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా నలుగురు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ కవిత తెలిపారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కదిరి టౌన్: మాఘమాసం సందర్భంగా శనివారం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి, శివాలయం, మరకత మహాలక్ష్మి, వాసవీమాత ఆలయంలో భక్తులు పోటెత్తారు. ఈసందర్భంగా స్వాములను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం నిర్వహించారు.

సంక్షిప్తం సమాచారం

పరీక్ష సామగ్రి అందజేత

కదిరి అర్బన్: కేఎస్‌పాళెం, కదిరి బ్రాహ్మణపల్లి జెడ్పీఉన్నత పాఠశాలలో చదివే 10వ తరగతి విద్యార్థులకు శనివారం హార్ట్ టు హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో దాత విజయవాడకు చెందిన విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్ పరీక్ష సామగ్రి అందజేశారు. సంస్థ అధ్యక్షుడు మూడే రవినాయక్, ఇన్‌చార్జ్ ఉపాధ్యాయుడు రఘునాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మహేశ్వరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆవుల స్వామి ఆరాధన

ముదిగుబ్బ: మండల సరిహద్దు ప్రాంతమైన అంబకపల్లి ఆవుల స్వామి ఆరాధన ఆదివారం నుంచి ఘనంగా జరుగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు అంకిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు బాబురెడ్డి, బండి రాఘవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బండి శివారెడ్డి, చిన్న ఓబుళరెడ్డి, లోక్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా పాఠశాల దినోత్సవం

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తిలోని సాయి గీత స్కూల్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్, పుట్టపర్తి మున్సిపల్ విప్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సాయి గీతను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ప్రయాణికులకు బహుమతులు

ధర్మవరం అర్బన్: లక్కీ డిప్ లాటరీ ద్వారా ప్రయాణికులకు బహుమతులు అందిస్తున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ధర్మవరం పులివెందుల రూట్ బస్సు లక్కీ డిప్ లాటరీని ప్రయాణికులు, విద్యార్థులతో తీయించారు. లాటరీలో విజేతలైన ప్రయాణికులు మొదటి బహుమతి పులివెందుల శ్రీనివాసులు, ద్వితీయ బహుమతి వెలిదండ్ల షరీఫ్, తృతీయ బహుమతి పార్నపల్లి వినోద్‌కుమార్‌లకు బహుమతులు వచ్చాయి. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేషులు, సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

తాడిమర్రి: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని సీడీపీఓ సరస్వతి పేర్కొన్నారు. దాడితోటలో రూ.6.50 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని శుక్రవారం ఆమె సర్పంచ్ వెంకటలక్ష్మమ్మతో కలసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంరక్షణ కోసం కృషి చేయాలన్నారు. బాల్యవివాహాలు, బాలికల అక్రమ రవాణా జరగకుండా అవగాహన కల్పించాలని ఆమె సిబ్బందికి ఆదేశించారు. సూపర్‌వైజర్లు చంద్రమ్మ, లలితమ్మ, వైఎస్సార్ సీపీ నేతలు శ్రీరామిరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ

నల్లమాడ: స్థానిక పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల డైరెక్టర్ పోలే వెంకటరెడ్డి మాతృమూర్తి రామక్రిష్ణమ్మ కాలుకు శస్త్ర చికిత్స చేయించుకొని కోలుకొంటోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం రాత్రి రామక్రిష్ణమ్మను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పాఠశాల డైరెక్టర్ పోలే వెంకటరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఏ.గంగిరెడ్డి, నాయకులు పోలే మహేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

ఆస్తి, ఖాళీ జాగా పన్నుపై వడ్డీ మాఫీ

ధర్మవరం అర్బన్: మున్సిపల్ పరిధిలోని ఆస్తి పన్ను, ఖాళీ జాగా పన్నుపై వడ్డీ మాఫీ కల్పిస్తున్నామని కమిషనర్ రామ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోపు పన్నుల బకాయిలు చెల్లించిన వారికి వడ్డీ మాఫీ వర్తింస్తుందని పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

గాండ్లపెంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ రామానాయక్ శనివారం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ వెంట ఉపాధ్యాయులు ఓబుళరెడ్డి, పీడీ పాపారాయులుడు ఉన్నారు.

పుట్టపర్తి: పుట్టపర్తి మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం ఎంఈఓ ప్రసాద్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నామన్నారు.

నాటుసారా ఊట ధ్వంసం

కదిరి అర్బన్: మరువతండాలో శనివారం నాటుసారా స్థావరాలపై రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్, ఎస్ఐ యతిరాజు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో 800 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.